సాక్షి తూర్పుగోదావరి

గురువారం | 23 | నవంబర్ | 2023



అన్నదానానికి విరాళం

కపిలేశ్వరపురం (మండపేట): అన్నవరంలోని సత్యదేవ నిత్యాన్నదానం ట్రస్టుకు మండపేటకు చెందిన కయిచర్ల అప్పారావు కుటుంబ సభ్యులు బుధవారం రూ.1,00,116 విరాళం అందించారు.



డెల్టా కాలువలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 1400, పశ్చిమ డెల్టాకు 4000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు



జిల్లాలో మోటారు సైకిళ్లు దొంగిలిస్తున్న వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ పి.జగదీష్ బుధవారం విలేకరులకు ఆ వివరాలను వెల్లడించారు.

II లో

న్యూస్‌రీల్

మృతి చెందిన బ్యాంక్ సభ్యులకు బీమా



బ్యాంక్ బ్రాంచి నిర్మాణం పనులు పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం సిటీ: ఆర్యాపురం కోపరేటివ్ బ్యాంక్ అభివృద్ధికి నిరంతర చర్యలు చేపడుతున్నట్లు పాలకవర్గ కమిటీ చైర్మన్, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన బ్యాంకు సభ్యులు అనంతరపు వెంకటరావు, సంగం శ్రీనివాస్ లకు చెందిన నామినీలకు గ్రూప్ జనతా పర్సనల్ ఆక్సిడెంట్ పాలసీ ద్వారా రూ. లక్ష వంతున బుధవారం బ్యాంకు కార్యాలయంలో కమిటీ సభ్యుల సమక్షంలో అందజేశారు. అనంతరం కోట గుమ్మం బ్రాంచి మార్పునకు తీసుకున్న కొత్త ప్రదేశంలో పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు కార్యదర్శి కె. స్వరాజ్య లక్ష్మి ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా సగటు వర్షపాతం 2.1 మి.మీ.

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా 2.1 మి.మీటర్లు సరాసరి వర్షపాతం నమోదైంది. గడచిన 24 గంటల నుంచి బుధవారం ఉదయం 8-30లోగా సీతానగరంలో 4.6 మి.మీటర్లు, కొవ్వూరులో 4.0, తాళ్లపూడిలో 5.2, చాగల్లులో 5.8, నిడదవోలు 3.4, పెరవలిలో 1.6, అనపర్తిలో 2.0, కడియంలో 1.4, రాజనగరంలో 1.2, రాజమహేంద్రవరం అర్బన్‌లో 1.4, రాజమహేంద్రవరం రూరల్ లో 2.6, కోరుకొండలో 2.6, గోకవరంలో 2.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్న తరుణంలో వర్షం కురవడంతో రైతులు తమ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

వాడపల్లి వెంకన్నకు రూ.96.67 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను బుధవారం లెక్కించగా రూ 96,67,708 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 34 రోజులకు ప్రధాన హుండీల నుంచి రూ 68,60,512, అన్నప్రసాదం హుండీల నుంచి రూ.28,07,196 వచ్చిందన్నారు. విదేశీ కరెన్సీతో పాటు బంగారం 38 గ్రాములు, వెండి 538 గ్రాములు లభించినట్టు తెలిపారు. ఆలయ క్షేత్రపాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీలను లెక్కించగా రూ.2,50,987 ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో మందపల్లి మందేశ్వర స్వామి ఆలయం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి ఈవో ఎన్‌వీఎస్ఎన్ఎస్‌వీ ప్రసాదరాజు, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకియమ్మ అన్నదాన సత్రం ఈవో ఎం.రాధాకృష్ణ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు.

ఓటు బాట పడదాం

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు అధికార యంత్రాంగం కృషి
- జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు
- రాజమహేంద్రవరంలో కియోస్కో అందుబాటు
- మార్పులు, చేర్పులు, నమోదుకు సమీపిస్తున్న అవకాశం
- జనవరిలో సంపూర్ణ ఓటర్ల జాబితా ప్రకటన



ఓటు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ కె.మాధవీలత



సాక్షి, రాజమహేంద్రవరం: మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రజాపక్ష, సుపరిపాలన అందించే ప్రభుత్వాన్ని ఎన్నుకునే బృహత్తర ఆయుధం ఓటు. అంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి కల్పించాలని జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. హక్కు పొందడమే కాకుండా దాన్ని వినియోగించుకునేలా చైతన్యం తీసుకువస్తోంది. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల సంగ్రామం నేపథ్యంలో తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపకల్పనపై కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే గత నెల 28న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించింది. ఓటర్ల మార్పులు, చేర్పులు, కొత్తగా ఓటు హక్కు నమోదు, జాబితాలో ఓటు ఉందో? లేదో? తెలుసుకునేందుకు అవకాశం కల్పించింది. ఇందుకు కోసం అధునాతన పద్ధతులు తెరపైకి తీసుకువచ్చింది. ఓటర్ల సౌకర్యార్థం ఓట్ల వివరాలను ఆన్‌లైన్ విధానంలో వెబ్‌సైట్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశాన్ని కల్పించింది. వచ్చే నెల 12వ తేదీ వరకు మార్పులు, చేర్పులు, కొత్త ఓట్ల నమోదుకు గడువు ఇచ్చింది.

జిల్లాలో ఇలా..

ఇటీవల విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఓటర్లు 15,60,354 ఉన్నారు. ఇందులో పురుషులు 7,63,694, మహిళలు 7,96,552, ఇతరులు 108 మంది ఉన్నారు. జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే డిసెంబర్ 26వ తేదీ వరకు క్లయిములను స్వీకరిస్తారు. వచ్చే జనవరి నెల 5వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రచురించనున్నారు.

కొత్త ఓటు నమోదుకు అవకాశం

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు కసరత్తు మొదలైంది. ఆదిశగా కొత్త ఓటర్లను నమోదు చేసేందుకు అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఓటరు నమోదుకు ప్రత్యేకంగా కియోస్కో యంత్రాలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇప్పటికే రాజమహేంద్రవరం నగరంలోని వైజంక్షన్ వద్ద ప్రారంభించారు. మరో ఎనిమిది యంత్రాలు సైతం సేవలు అందించనున్నాయి. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ అధికారులు చేపడుతున్న సామాజిక కార్యక్రమాలు, అవగాహన సదస్సులు ఆకట్టుకుంటున్నాయి. స్వీప్-ఓటరు పేరుతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. బీఎల్ఓలను రంగంలోకి దింపారు. వారి పరిధిలో ఉన్న ప్రతి ఒక్క అర్హత కలిగిన ఓటరును నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా యువత ఓటు హక్కు నమోదుకు ముందుకు రావాలని వారిలో చైతన్యం నింపుతున్నారు.

ఓటుందో లేదో చూసుకోండి:

ఎన్నికల సంఘం ఓటర్స్ సర్వీస్ పోర్టల్ వెబ్‌సైట్ ద్వారా ఓటు ఉందో లేదో తెలుసుకునే అవకాశాన్ని కల్పించింది. ఇందుకు ఓటర్స్.ఈసీఐ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ ఓటు లేకపోతే ఫారం-6 ద్వారా నమోదు కావావాల్సి ఉంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో తరచుగా ఇళ్లు మారుతుంటారు. ఆ సమయంలో పాత చిరునామా నుంచి కొత్త చిరునామాకు ఓటును మార్చుకోవాలని స్పష్టం చేశారు. అలాంటి వారు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంటున్నారు. ఓటరు జాబితా నుంచి పేరు తొలగింపు, మృతి చెందిన వారికి చెంది ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ సేవలు పొందేందుకు బీఎల్వోను ఆశ్రయించాల్సి ఉంది.

సెల్‌ఫోన్ ద్వారా..

- ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకునేందుకు సెల్‌ఫోన్లను సైతం వినియోగించవచ్చు. ఆండ్రాయిడ్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో ఒకటి ఎంపిక చేసుకుని రిజిస్టర్ చేయాలి. అనంతరం ఓటు హక్కు తెలుసుకునేందుకు నాలుగు మార్గాలు ఉంటాయి.
- పాత ఓటరు కార్డు ముందు భాగంలో బార్ కోడ్ ఉంటుంది. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో బార్‌కోడ్ ఆప్షన్ ఎంచుకుని స్కాన్ చేస్తే వివరాలు తెలుస్తాయి.
- కొత్తగా జారీ చేస్తున్న కార్డులు క్యూఆర్ కోడ్‌తో వస్తున్నాయి. యాప్‌లో కోడ్ ఆప్షన్ ఎంపిక చేసుకుని స్కాన్ చేస్తే వివరాలు తెలుస్తాయి.
- తండ్రి పేరు, వయసు, జండర్, రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం వివరాలు నమోదు చేస్తే మీ ఓటు హక్కు ఉందో లేదో స్పష్టమవుతుంది.
- ఓటరు కార్డుకు ఉన్న నంబర్ తీసుకుని, యాప్‌లో నంబర్ ఆప్షన్ ఎంపిక చేసుకుని నంబర్ ఎంటర్ చేస్తే వివరాలు తెలుస్తాయి.

జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
అనపర్తి	1,06,664	1,10,669	3
రాజానగరం	1,03,017	1,05,032	9
రాజమండ్రి సిటీ	1,23,110	1,32,088	64
రాజమండ్రి రూరల్	1,26,425	1,32,349	12
కొవ్వూరు	86,855	91,272	6
నిడదవోలు	1,01,924	1,06,131	7
గోపాలపురం	1,15,699	1,19,011	7

టీడీపీ బురద రాజకీయం:

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్న తలంపుతో ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటే.. టీడీపీ నేతలు ప్రభుత్వం బురద జల్లుతున్నారు. రాజకీయంగా లబ్ధి పొందేందుకు నిరాధార ఆరోపణలకు తెగబడుతున్నారు. టీడీపీ నేతల ఓట్లు తొలగిస్తున్నారని అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు తెలుసుకోకుండా ఆరోపణలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం పారదర్శకంగా జాబితా రూపకల్పనకు కృషి చేస్తోంది.

పారదర్శకంగా జాబితా రూపకల్పన



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నదే ఎన్నికల సంఘం, ప్రభుత్వం ఉద్దేశం. అందుకు అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం. జాబితాను పారదర్శకంగా, పకడ్బందీగా రూపొందిస్తున్నాం. ఇప్పటికే ముసాయిదా జాబితా విడుదల చేసి అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రచురించాం. బీఎల్వోకు సైతం జాబితా పంపాం. కియోస్కుల ద్వారా ఓటు ఉందో లేదో తెసుకునే ఏర్పాట్లు చేశాం. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చైతన్యం తీసుకువస్తున్నాం. అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహించాం.

– కె.మాధవీలత, కలెక్టర్

ధాన్యం కొనుగోళ్లను పరిశీలించిన కలెక్టర్



ధాన్యం కొనుగోళ్లపై రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టరు మాధవీలత

రాజానగరం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 231 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 169 కేంద్రాలను ప్రారంభించామని కలెక్టరు మాధవీలత తెలిపారు. మండలంలోని కొండగుంటూరులో బుధవారం కొన్ని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారామె. అక్కడ జరుగుతున్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు. రైతులతోను, రవాణాకు ఉపయోగిస్తున్న వాహన చోదకులతోను మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఏవిధంగా జరుగుతుంది, ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా .. అని ఆరా తీశారు. ధాన్యం కొనుగోలు జరిగిన 24 గంటల్లోనే తమ బ్యాంకు ఖాతాలలో సొమ్ము జమ అవుతోందని పలువురు రైతులు వివరిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ఆర్‌బీకే సహాయకుల ద్వారా పొలం వద్దకు వచ్చి ధాన్యాన్ని తీసుకు వెళ్తున్నారన్నారు. ఈ విషయంలో మిల్లర్ల నుంచి కూడా ఎటువంటి ఒత్తిళ్లు, ఇబ్బందులు లేవన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రవాణా చేసే వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ని అమరుస్తున్నారని లారీ డ్రైవర్ చెప్పాడు. తొలుత గ్రామంలోని ఆర్‌బీకేను సందర్శించిన కలెక్టర్ అక్కడ ఉన్న రికార్డులను, డేటా ఎంట్రీ వివరాలను, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన పరికరాలను పరిశీలించారు.

సాగుబడిలో అడుగుపెట్టిన జేసీ

- 3.42ఎకరాలు కౌలుకు తీసుకున్న తేజ్‌భరత్
- ఎంటీయూ-1318 వరిరకం సాగు
- ఆశాజనకంగా దిగుబడులు
- రైతుల సాధకబాధలు తెలుసుకునేందుకే పొలంబాట పట్టాను: జేసీ



కౌలుకు తీసుకున్న పొలంలో వరికోతలను ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: సాగులో రైతు పడే కష్టనష్టాలను స్వయంగా తెలుసుకున్నానని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ బుధవారం చెప్పారు. వరిసాగులో విత్తనం నుంచి విక్రయం వరకు అవగాహన కలిగేందుకు రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలులో ఆయన ఈ ఖరీఫ్ సీజన్‌లో 3.42ఎకరాలలో కౌలు తీసుకున్నారు. ఎంటీయూ-1318 వరిరకం సాగు చేశారు. రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రీయ ఎరువులైన పంచకవ్యం, ఘనజీవామృతం ఉపయోగించారు. ప్రతీ వారం కౌలుకు తీసుకున్న పొలాన్ని వ్యవసాయాధికారులతో కలిసి సందర్శిస్తున్నారు. గట్లపై గోంగూర, ఆనప, బెండ తదితర పూల, కూరగాయల మొక్కలను వేశారు.

ఎకరాకు 32బస్తాలు

తేజ్‌భరత్ కౌలు తీసుకొన్న పొలంలో వరికోత యంత్రంతో వరి కోశారు. ముందుగా జేసీ తేజ్‌భరత్ దంపతులు కోతలను ప్రారంభించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, సహాయసంచాలకులు శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారి భీమరాజు ఆధ్వర్యంలో వరిబస్తాల దిగుబడి అంచనావేశారు. మూడు ఎకరాలకు 97బస్తాల దిగుబడి నమోదైనట్లు ఏడీ తెలిపారు. మండల ప్రత్యేకాధికారి జ్యోతి, తహసీల్దార్ పైడి చిన్నారావు, డిప్యూటీతహసీల్దార్ సాగర్, ఎంఎస్‌వో ప్రభాకర్, పంచాయతీకార్యదర్శి జి.కాశీవిశ్వనాథ్, మాజీఎంపీటీసీ నక్కా శ్యాంబాబు, రైతు మల్లిపూడి ఉదయకిరణ్, విఆర్‌వో జోసఫ్‌రాజు, ఏఈవో వేణుమాధవ్, విఏఏలు దుర్గబాబు, హేమంత్, నాగబాబు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తా...

రైతులు పడుతున్న కష్టనష్టాలను స్వయంగా తెలుసుకోవడానికి వరిపొలంకౌలుకు తీసుకుని వ్యవసాయాధికారుల సహకారంతో సాగు చేశాను. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అవగాహన వచ్చింది. వరిపంటకు అయిన ఖర్చు, వచ్చిన రాబడిని బేరీజు వేసుకుని రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అవుతుందా అన్నదానిపై ప్రభుత్వానికి నివేదిస్తాను.

–ఎస్.తేజ్‌భరత్, జాయింట్‌కలెక్టర్, తూర్పుగోదావరిజిల్లా

24 గంటల్లో ధాన్యం సొమ్ము జమ

జేసీ తేజ్‌భరత్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఈ ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతు ఖాతాకు జమ చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. తేజ్ భరత్ తెలిపారు. రైతులు కూడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించేందుకు ఆసక్తి కనపరుస్తున్నారన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి రెవెన్యూ సంస్కరణలు, ఎన్నికలు, పౌర సరఫరాలు, రీ-సర్వే, ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ, ల్యాండ్ టైట్లింగ్ చట్టంశిక్షణ లాంటి అంశాలపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సంస్కరణలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమేరకు క్షేత్ర స్థాయిలో అధికారులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయన్నారు. ఇందుకు క్షేత్ర స్థాయిలో ఆర్బీకేల వారీగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రస్తుత వాతావరణ మార్పులు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని 231 ఆర్బీకేల పరిధిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టామన్నారు. ఇప్పటికే 167 కేంద్రాల ద్వారా కొనుగోళ్లకు శ్రీకారం చుట్టామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు వారి ఖాతాలో 24 గంటల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పూర్తి సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. కోతలు తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలు, కుప్ప నూర్పిడీ, తదితర అంశాలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో నరసింహులు, పీవో జిల్లా నోడల్ అధికారి జేవీ సత్యనారాయణ, అదనపు ఎస్పీ రజని, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు సువర్ణ, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు



సత్యదేవుని దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం కార్తిక శుద్ధ దశమి, బుధ వారం పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణం, వ్రతమండపాలు, క్యూ లైన్లు అన్నీ నిండిపోయాయి. సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించగా స్వామివారి వ్రతాలు 2,700 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షలు ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. గురువారం ఏకాదశి, శుక్రవారం క్షీరాబ్ది ద్వాదశి, శని, ఆదివారాలు పర్వదినాలు, సోమవారం పౌర్ణిమ కావడంతో సత్యదేవుని సన్నిధికి భారీగా భక్తులు తరలివస్తారని భావిస్తున్నారు.

సామాజిక జన జాగృతి

- నేడు ప్రత్తిపాడులో సామాజిక సాధికార సభ
- బస్సు యాత్ర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ముస్తాబైన అల్లూరి సీతారామరాజు సెంటర్
- తరలిరానున్న వైఎస్సార్‌సీపీ అగ్రనేతలు



ప్రత్తిపాడులో సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రదేశాలను జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులుతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్ర ప్రసాద్

సాక్షిప్రతినిధి, కాకినాడ: బీసీలంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదు.. బ్యాక్ బోన్ క్యాస్ట్..ఈ మాటలు అనడమే కాదు ఆచరణలో సాధ్యం చేసి చూపించారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. నాలుగున్నరేళ్ల తమ పాలనలో ఆయన బడుగు బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో అగ్రాసమేశారు. తమ హయంలో ఆయా వర్గాలకు చేకూరిన సామాజిక హోదా గురించి వివరించేందుకు తలపెట్టినదే సామాజిక సాధికార బస్సు యాత్ర. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతోన్న ఈ బస్సు యాత్ర కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో గురువారం జరగనుంది. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఈ నెల 6న తొలి యాత్రకు శ్రీకారం చుట్టారు. డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో రెండో సభ జరిగింది. మూడో సభకు మెట్ట ప్రాంతమైన ప్రత్తిపాడు గురువారం వేదిక కానుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇంత వరకు జరిగిన కాకినాడ రూరల్, కొత్తపేట నియోకవర్గాల సామాజిక సాధికార బస్సు యాత్ర సభలకు బీసీ, ఎస్సీలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. విజయవంతం చేశారు. మెట్ట ప్రాంతంలో జరిగే తొలి సభకు బీసీ, ఎస్సీలు పెద్ద ఎత్తున తరలివచ్చేందుకు సంసిద్ధులవుతున్నారు.

ఆచరణ సాధ్యం

బీసీ, ఎస్సీలను గత పాలకులు ఓటు బ్యాంక్‌గా వాడుకుని వదిలేసేవారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇందుకు భిన్నంగా ఆయా వర్గాలకు నిజమైన సామాజిక సాధికారతను తన పాలనలో చూపించారు. రాజకీయంగా, ఆర్థికంగా బీసీ, ఎస్సీ సామాజికవర్గాలను సమున్నత స్థానానికి తీసుకువెళ్లారు. అందుకే ముఖ్యమంత్రి జగన్‌కు ఆయా వర్గాలు బ్రహ్మరథం పడుతున్నాయి. ముఖ్యమంత్రి తరచూ తన ప్రసంగంలో చెప్పే' నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు' అనే మాటలకు సామాజిక సాధికారతలో రూపమిచ్చారు. ఈ విషయాలన్నింటినీ ఆయా వర్గాలకు వివరించేందుకు ప్రత్తిపాడులో జరిగే సామాజిక సాధికారిత బస్సు యాత్ర సిద్ధమైంది. బహిరంగ సభకు బీసీ, ఎస్సీ సామాజికవర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తున్నారు. మీ కుటుంబానికి ఈ ప్రభుత్వం వల్ల మేలు జరిగిందంటేనే మళ్లీ మాకు ఓటెయ్యండి అని ధైర్యంగా ఓటు అడిగే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ తెగువను ఈ సందర్భంగా జనం స్వాగతిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో బీసీ, ఎస్సీలకు కలిగిన లబ్ధిని ఈ సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు వివరిస్తారు.

ప్రత్తిపాడుకు పార్టీ అగ్ర నాయకులు

గురువారం బస్సు యాత్ర బహిరంగ సభకు బీసీ, ఎస్సీ సామాజికవర్గాలకు చెందిన వైఎస్సార్ సీపీ అగ్రనాయకులు రానున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీదిరి అప్పలరాజు, సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మేరుగు నాగార్జున, పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, దాడిశెట్టి రాజా, ఎంపీలు నందిగం సురేష్, వంగా గీత, పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారధి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణితో పాటు జిల్లా ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

పార్కింగ్ ఇలా..

కార్లకు స్థానిక అగ్నిమాపక కేంద్రం సమీపాన పార్కింగ్ ఏర్పాటు చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద ఆటోలకు, లయన్స్‌క్లబ్ కల్యాణ మండపం వద్ద మోటారు సైకిళ్ల నిలుపుకునేందుకు ఏర్పాటు చేశారు.

స్థానిక జాతీయ రహదారిపై పుత్ర చెరువు జంక్షన్ నుంచి మెయిన్‌రోడ్డు వెంబడి అల్లూరి జంక్షన్, బైపాస్‌లోని అటవీశాఖ చెక్‌పోస్టు వరకూ, జాతీయ రహదారిలో ధర్మవరం నుంచి ప్రత్తిపాడు వరకూ రోడ్డు వెంబడి ఇరువైపులా స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సభకు నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల నుంచి వేలాది మంది జనం తరలిరానున్నారు.

బస్సు యాత్రకు విస్తృత ఏర్పాట్లు

ప్రత్తిపాడు/ఏలేశ్వరం: ప్రత్తిపాడులో గురువారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. యాత్ర సభాస్థలి, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లకు అనువైన ప్రదేశాలను ఇప్పటికే గుర్తించారు. ఈ ప్రదేశాలను బుధవారం సాయంత్రం జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) పోలునాటి శ్రీనివాసులుతో కలిసి ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్ర ప్రసాద్ పరిశీలించారు. రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. సభాస్థలి, పార్కింగ్ ఏర్పాట్లలో ఎమ్మెల్యే పర్వత ఆధ్వర్యంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, జేసీఎస్ మండల కన్వీనర్ రామిశెట్టి చినబాబు, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు గొంతిన సురేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, ఎంపీటీసీలు, గృహ సారథులు, పార్టీ నాయకులు నిమగ్నమయ్యారు.

క్లుప్తంగా

'నన్నయ'లో బీఫార్మసీ కోర్సు


ఆచార్య పద్మరాజు, నన్నయ్య వీసీ

రాజానగరం: ఈ విద్యా సంవత్సరం నుంచి 'నన్నయ'లో బీఫార్మసీ కోర్సు నిర్వహించేందుకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి అనుమతి లభించిందని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో నూతన నిర్మించిన భవనంలో ఈ కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. ఆధునిక లైబ్రరీ, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఈ కోర్సులో చేరే విద్యార్థులు ఏపీఈఏపీసెట్‌లో అర్హత సాధిస్తే ఈ నెల 25లోగా వెబ్ ఆప్షన్‌లో ఏకేఎన్‌టీఏఎస్‌ఎఫ్‌ను ఎంచుకోవచ్చన్నారు.

యువకుడి మృతి

సీతానగరం: మోటారు సైకిల్ బోల్తా పడి తలకు తీవ్రగాయం కావడంతో యువకుడు మృతి చెందాడు. మండలంలోని వెదుళ్లపల్లి పంచాయతీ పరిధి రాజంపేటకు చెందిన దూళ్ల దుర్గాప్రసాద్ (26) మంగళవారం రాత్రి టిఫిన్ కోసం సీతానగరం వచ్చాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా ముగ్గళ్ల ఎస్సీపేట వద్ద సిమెంట్ రోడ్డు శివారున మోటారు సైకిల్ బోల్తాపడింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమైన అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బావ తోట పోశయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చిరంజీవి తెలిపారు.

బాస్మతి.. బ్లాక్ బస్టర్

- కొత్త వంగడంతో నల్ల బియ్యాన్ని పండించిన చేబ్రోలు రైతు
- సేంద్రియ పద్ధతిలో పంట సాగు, రికార్డు స్థాయిలో దిగుబడి


బ్లాక్ బాస్మతి ధాన్యం


బ్లాక్ బాస్మతి రైస్ సాగు చేసిన పొలం


బ్లాక్ బాస్మతి రైస్

పిఠాపురం: వరిలో అనేక రకాలు ఉన్నాయి. నేల స్వభావాలను బట్టి కొన్ని రకాలే పండుతుంటాయి. కానీ గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన ఓదూరి నాగేశ్వరరావు తన పొలంలో ప్రయోగాత్మకంగా కొత్త వంగడాన్ని వేసి సత్ఫలితాలు సాధించారు. మణిపూర్ బాస్మతి బ్లాక్ రైస్‌ను పండించి రైతు తలుచుకుంటే దేనినైనా సాధించవచ్చని నిరూపించారు. ఇప్పటికే ఉద్యాన పంటల్లో వినూత్న పంటలు పండించి అబ్బురపరచిన నాగేశ్వరరావు తన మూడున్నర ఎకరాల పొలంలో బర్మా నుంచి తెప్పించిన బ్లాక్ బాస్మతి రైస్‌ను సాగు చేశారు. ఎటువంటి రసాయనిక ఎరువులు వాడకుండా కేవలం సేంద్రియ పద్ధతిలో సాగు చేయడంతో ఎటువంటి తెగుళ్లు సోకకుండా పంట దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. ఎకరానికి 25 బస్తాల దిగుబడి రాగా ఈ బియ్యం మార్కెట్‌లో కిలో రూ.450 పలుకుతుండడంతో ఆదాయం భారీగా వచ్చింది.

పోషక విలువలు ఎక్కువ

ఈ బియ్యంలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. యాంటీ యాక్సిడెంట్లు, యాత్రోసైనిక్, యాంటీ డయాబెటిక్, యాంటీ క్యాన్సర్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబియల్, యాంటీ ఒబేసిటీగా ఈ బియ్యం పనిచేస్తాయి. అందుకే వీటికి విలువ ఎక్కువ. మార్కెట్‌లో ధర ఎక్కువగానే ఉంటుంది. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వాటికి మరింత గిరాకీ ఉంటుంది. రైతు నాగేశ్వరరావు విభిన్న పంటల సాగులో మంచి ప్రావీణ్యం కనబరుస్తుంటారు.

– సత్యనారాయణ, వ్యవసాయశాఖాధికారి, గొల్లప్రోలు

ప్రయోగాత్మకంగా సాగు



బ్లాక్ బాస్మతి రైస్‌కు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని తెలిసి ప్రయోగాత్మకంగా సాగు చేశాను. పెట్టుబడి తక్కువగా ఉండేందుకు సేంద్రియ పద్ధతి పాటించాను. విత్తనాలను బర్మా నుంచి తెప్పించి సాగు చేయగా ఎటువంటి తెగుళ్లు లేకుండా ఏపుగా పెరిగి, ఎకరానికి 25 బస్తాల దిగుబడి వచ్చింది. పెట్టుబడి చాలా తక్కువ అయ్యింది.

– ఓదూరి నాగేశ్వరరావు, రైతు, చేబ్రోలు

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

- 24 ద్విచక్ర వాహనాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జగదీష్


స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్, టూటౌన్ సీఐ గణేష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో మోటారు సైకిళ్లు దొంగిలిస్తున్న వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ పి.జగదీష్ బుధవారం విలేకరులకు ఆ వివరాలను వెల్లడించారు. ఇటీవల జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా మోటారు సైకిళ్ల దొంగతనాలు జరుగుతున్నాయి. ఎస్పీ ఆదేశాల మేరకు దీనిపై దృష్టి సారించిన పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం రామకృష్ణ కాలనీకి చెందిన పలివెల బెనర్జీ ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. అతడి కదలికలపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బెనర్జీని రెండో పట్టణ సీఐ టి.గణేష్ బృందం తూర్పు రైల్వేస్టేషన్ వద్ద అదుపులోకి తీసుకుంది. అతడి నుంచి 24 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుంది. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్ కోసం సెంట్రల్ జైలుకు తరలించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న 24 ద్విచక్ర వాహనాలలో 8 మోటారు సైకిళ్ల యజమానులను గుర్తించాల్సి ఉంది. ఎవరైనా రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి, తగిన ఆధారాలు చూపి వాహనాన్ని తీసుకెళ్లవచ్చని ఎస్పీ తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసైన బెనర్జీ దొంగతనాలకు అలవాటు పడ్డాడన్నారు. మారు తాళాలను ఉపయోగించి రాత్రి సమయంలో ఇళ్లు, బయట పార్కింగ్ చేసిన మోటారు సైకిళ్లను దొంగలించేవాడన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న రెండో పట్టణ సీఐ టి.గణేష్, ఎస్సై పి.అప్పారావు, జీవీవీ సత్యనారాయణ, మురళీకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ ఎస్.రాజశేఖర్, పీసీలు కె.ప్రదీప్ కుమార్, ఎస్.వీరబాబు, బీఎస్‌కే.నాయక్‌ను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలను అందించారు. కాగా.. ఏపీ 37 సీపీ 2620 (గ్లామర్), ఏపీ 37 బీపీ 2792 (గ్లామర్), ఏపీ 31 బీఎం 2591 (స్ప్లెండర్ ప్రొ), ఏపీ 27 బీఎస్ 1643 (గ్లామర్), ఏపీ 28 సీకే 7550 (గ్లామర్), ఏపీ 05 బీడబ్ల్యూ 6601 (స్ప్లెండర్ ప్రొ), ఏపీ 05 సీఎం 7061 (గ్లామర్), ఏపీ 28 డీకే 4987 (గ్లామర్) మోటారు సైకిళ్ల యజమానులను గుర్తించాల్సి ఉంది.

కొబ్బరి రంగం అభివృద్ధికి ప్రణాళికలు


మాట్లాడుతున్న హార్టీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్ సుజాత

అంబాజీపేట: గోదావరి పరీవాహక ప్రాంతంలో కొబ్బరి రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ) డిప్యూటీ డైరెక్టర్ కుమార్ వేల్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టీ కల్చర్ ఎస్.సుజాత తెలిపారు. స్థానిక కొబ్బరి పరిశోధనా కేంద్రంలో బుధవారం కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తులు, కొబ్బరి అభివృద్ధి బోర్డ్ పథకాలపై రెండు రోజుల శిక్షణ ప్రారంభమైంది. కొబ్బరి పరిశోధనా కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని ఉద్యానశాఖ అధికారులు హాజరయ్యారు. శిక్షణలో కొబ్బరి అభివృద్ధి బోర్డు నుంచి రైతులకు అందించే రాయితీలను వివరించారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్స్ ఆర్గనైజేషన్ (ఫియో) అసిస్టెంట్ డైరెక్టర్ జి.రఘునాథబాబు మాట్లాడుతూ కొబ్బరి ఎగుమతుల కార్యకలాపాలను వివరించారు. కాకినాడ జిల్లా ఉద్యానశాఖాధికారి ఎస్.మల్లికార్జునరావు, కోనసీమ జిల్లా అధికారి బీవీ రమణ, స్థానిక శాస్త్రవేత్తలు ఎ.కిరీటి, వి.అనూష పాల్గొన్నారు.

ట్రైనీ కలెక్టర్ల పర్యటన


రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్లు

కడియం: ట్రైనీ కలెక్టర్లు పి.సువర్ణ, ఎం.భానుప్రకాష్‌రెడ్డి బుధవారం కడియం మండలంలో పర్యటించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంతో పాటు, కడియం సచివాలయం 1, వేమగిరి సచివాలయం 4ను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలువుతున్నాయి, సమస్యలు ఏమైనా ఉన్నాయా? తదితర అంశాలపై సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను ఆరా తీశారు. ప్రభుత్వం లక్ష్యం ఎంత వరకూ ప్రజలకు చేరుతుందన్నదీ తెలుసుకున్నారు. వేమగిరి సచివాలయంలో రిజిస్ట్రేషన్ విధానాన్ని అక్కడి డిజిటల్ అసిస్టెంట్ సుమంత్ వివరించారు. వారి వెంట మండల పరిషత్ ఏవో కె.చంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ దాస్, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

సత్యదేవుని తెప్పోత్సవానికి సర్వం సిద్ధం

- రేపు రాత్రి పంపానదిలో స్వామి, అమ్మవార్ల విహారం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


తెప్పోత్సవం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ రామచంద్రమోహన్


పంపా నదిలో పంటు ట్రయల్ రన్

అన్నవరం: కార్తిక శుద్ధ ద్వాదశి (క్షీరాబ్ది ద్వాదశి) పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి పంపా నదిలో జరగనున్న తెప్పోత్సవానికి ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నదిలో హంసవాహనంపై సత్యదేవుడు, అనంతలక్ష్మి, సత్యవతి అమ్మవార్లు మూడు సార్లు విహరించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ధవళేశ్వరం నుంచి వచ్చిన నీటిపారుదల శాఖ సిబ్బంది ఈ తెప్పోత్సవంలో ఉపయోగించే పంటుకు మరమ్మత్తులు పూర్తి చేసి, రంగులు వేశారు. కాకినాడ పోర్టు నుంచి వచ్చిన సిబ్బంది ఈ పంటుకు ఇంజిన్ బిగించి పూర్తిస్థాయిలో తనిఖీలు చేశారు. దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ బుధవారం ఉదయం పది గంటలకు పంపా నది వద్ద తెప్పోత్సవం ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి ఆదేశాలిచ్చారు. కార్యక్రమానికి విచ్చేసే భక్తులు, వీఐపీలకు ఏర్పాట్లు చేయడానికి దేవస్థానం సిబ్బందితో మూడు కమిటీలను నియమించారు.

పంపాలో ట్రయల్ రన్

తెప్పోత్సవానికి ఉపయోగించే పంటుకు బుధవారం సాయంత్రం పంపానదిలో ట్రయిల్ రన్ వేశారు. రెండుసార్లు నడిపి ఎటువంటి ఇబ్బందులు లేదని నిర్ధారించారు. అన్నవరం దేవస్థానం ఈఈ మురళీ, డీఈలు గుర్రాజు, సూర్యనారాయణ, ఇరిగేషన్ ఐజీ కె.శ్రీదేవి, ధవళేశ్వరం ఇరిగేషన్ వర్క్‌షాప్ సిబ్బంది, కాకినాడ పోర్టు సాంకేతిక నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నీటి సమస్య లేనట్టే..

సత్యదేవుని తెప్పోత్సవానికి నీటి సమస్య పరిష్కారమైనట్టే. ఈ నెల పదో తేదీన పంపా నీటిమట్టం 89 అడుగులు మాత్రమే ఉండడంతో పంటు తిరగడానికి నీరు సరిపోదని దేవస్థానం అధికారులు ఆందోళన చెందారు. ఈ పరిస్థితుల్లో వారం రోజులుగా పుష్కర, ఏలేరు నుంచి పంపాకు నీటిని విడుదల చేస్తుండడంతో బుధవారం సాయంత్రానికి 93 అడుగులకు చేరుకుంది. శుక్రవారం రాత్రి తెప్పోత్సవం జరిగే సమయానికి నీటిమట్టం 94 అడుగులు ఉంటుందని పంపా ప్రాజెక్ట్ ఐజీ కె.శ్రీదేవి తెలిపారు. పుష్కర నుంచి బుధవారం వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు వివరించారు. పంపా ఆయకట్టుకు వెళ్లే నీటిని పది క్యూసెక్కులకు తగ్గించారు.

మహిళా కారాగారం సందర్శన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక సెంట్రల్ జైలులోని మహిళా కారాగారాన్ని డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి బుధవారం సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి, వారి ఆరోగ్యం, అక్కడి సదుపాయాలను తెలుసుకున్నారు. ఖైదీలు పరివర్తన చెంది గౌరవంగా జీవించాలని, న్యాయబద్ధమైన జీవనంతోనే గౌరవం లభిస్తుందన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ నియమించిన పారా లీగల్ వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. ఖైదీలకు అందుబాటులో ఉంటూ, వారి అవసరాలు, సమస్యలను తెలియపర్చాలని వారికి సూచించారు. ఖైదీల తరఫున వాదించేందుకు న్యాయవాది లేనిపక్షంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయవాదిని నియమిస్తుందన్నారు.



మంగళవారం చిత్రబృందం సందడి


స్వామి థియేటర్‌లో మాట్లాడుతున్న దర్శకుడు అజయ్ భూపతి, చిత్రంలో హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మంగళవారం సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు ఆ చిత్ర దర్శకుడు అజయ్ భూపతి ధన్యవాదాలు తెలిపారు. ఆయన కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలతో, స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ నిర్మించిన మంగళవారం సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో విజయయాత్రలో భాగంగా ఆ చిత్ర బృందం బుధవారం సాయంత్రం స్థానిక స్వామి థియేటర్‌కు విచ్చేసింది. హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్, శ్రీతేజ్, శ్రావణ్, లక్ష్మణ్, నిర్మాత సురేష్‌వర్మలతో కూడిన చిత్ర బృందానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చిత్ర పంపిణీ దారులు శివ వీరభద్ర ఫిలిమ్స్ పక్షాన సురేష్, థియేటర్ పక్షాన మేనేజర్ నగేష్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం థియేటర్‌లో చిత్రబృందం సందడి చేసింది. దర్శకుడు అజయ్ భూపతి మాట్లాడుతూ ఒక యూనిక్ పాయింట్‌ను తీసుకుని తెరకెక్కించిన ఈ సినిమాకు మంచి స్పందన లభిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం అంటే తనకు ఎంతో ఇష్టమని, స్వామి థియేటర్‌లో చాలా సినిమాలు చూశానన్నారు. ఇప్పుడు చిత్ర విజయంతో ఇక్కడికి రావడం ఆనందంగా ఉందన్నారు. హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ ఆర్‌ఎక్స్ 100 సినిమా సందర్భంగా ఈ థియేటర్‌కు వచ్చామని, మరలా ఇప్పుడు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. శ్రావణ్, శ్రీతేజ్ మాట్లాడుతూ మంగళవారం చిత్రం మంచి సందేశం ఇచ్చిందని, ఆడవాళ్లు తప్పనిసరిగా చూడాలని కోరారు. నిర్మాత సురేష్ వర్మ మాట్లాడుతూ తొలి ప్రాజెక్ట్ మంగళవారం మూవీకి అద్భుత విజయాన్ని అందించిన ప్రేక్షకులు ధన్యవాదాలు తెలిపారు. ముందుగా థియేటర్ ఆవరణలో కేక్ కట్ చేశారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఆత్రేయపురం: మండల పరిధిలోని పేరవరం గ్రామానికి చెందిన కోట వెంకటేశ్వరరావును తాడేపల్లి గూడేనికి చెందిన ఎలిగంటి అంతర్వేది నరసన్న కర్రతో కొట్టి గాయపర్చాడు. కొత్తపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై బీవై కిరణ్ కుమార్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పేరవరానికి చెందిన కోట వీరమణికి తాడేపల్లి గూడేనికి చెందిన ఎలిగంటి అంతర్వేది నరసన్నతో 2021లో వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. కుటుంబ కలహాల కారణంగా మంగళవారం ఇరు వర్గాలూ చర్చలు జరుపుతున్న సమయంలో వెంకటేశ్వరరావును నరసన్న కర్రతో కొట్టి గాయపర్చాడు. అలాగే మరో ముగ్గురు పెద్దలపై కూడా దుర్భాషలాడి బెదిరించాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలు

పిఠాపురం: కత్తిపూడి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పోలవరం గట్టు నుంచి అక్రమంగా మట్టిని ట్రాక్టర్‌పై తరలిస్తుండగా చెందుర్తి సెంటర్ వద్ద విశాఖపట్నం నుంచి హనుమాన్ జంక్షన్ వెళుతున్న బస్సును ప్రమాదవశాత్తూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం వలనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

శ్రీపీఠంలో ఆధ్యాత్మిక కాంతులు

- మహాశక్తి యాగం ప్రాంగణంలో అయ్యప్ప పడిపూజ
- తరలివచ్చిన భక్తులు


భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న పరిపూర్ణానందస్వామి


షట్కోణతంత్ర పూజలు చేస్తున్న పండితులు

కాకినాడ రూరల్: మహాశక్తి యాగం ప్రాంగణం శ్రీపీఠంలో ఆధ్యాత్మిక పవనాలు వీస్తున్నాయి. ఆకాశం మేఘావృతంగా ఉండి, చలిగాలులు పెరుగుతున్న వేళ.. శ్రీపీఠం కోటి కాంతులు వెలుగులతో తళుక్కుమంటోంది. శత కోటి లలితా నామార్చనలతో మహిళలు కుంకుమ పూజలు చేస్తూ భక్తిభావంతో అమ్మవారి సేవలో తరిస్తున్నారు. మానవళికి శుభం జరగాలని కోరుకుంటూ, కేవలం ద్రవ పదార్థాలు సేవిస్తూ దీక్ష చేపట్టిన పరిపూర్ణానందస్వామి రోజూ భక్తులకు అనుగ్రహ భాషణలు చేస్తూ ఆధ్యాత్మికతను చాటుతున్నారు. మరో వైపు సమాజ హితం కోరుతూ నిత్యం నక్షత్ర శాంతి హోమం, తిథి పూజలు, అతిరుద్ర యాగం, బగళాముఖి అమ్మవారి హోమాలను వేద పండితులతో నిర్వహిస్తున్నారు. 9వరోజు బుధవారం ఉదయం వేలాది మహిళలతో లలితా కుంకుమార్చనలు చేయించారు. సాయంత్రం కోటి దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత కళాకారులు కూచిపూడి నృత్యాలతో అలరించారు. మండల దీక్షలతో ఉన్న అయ్యప్ప భక్తుల కోసం మహాశక్తి యాగం ప్రాంగణంలో రాత్రి కేరళ శబరిమల పందళరాజ కుటుంబీకులతో షట్కోణతంత్ర అయ్యప్ప పూజ, పడిపూజకు ఏర్పాట్లు చేశారు. సుమారు ఐదువేల మంది అయ్యప్ప భక్తులు పూజలో పాల్గొన్నారు. పరిపూర్ణానందస్వామి మాట్లాడుతూ కేరళలోని శబరిమలలో జరిగే షట్కోణ తంత్ర అయ్యప్ప పూజను మహాశక్తి యాగం ప్రాంగణంలో ఏర్పాటు చేశామన్నారు.

విజయవంతంగా మహాశక్తి యాగం

కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగం విజయవంతంగా కొనసాగుతోందని శ్రీపీఠం వ్యవస్థాపకుడు పరిపూర్ణానంద స్వామి అన్నారు. యాగం 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బుధవారం ఆయన శ్రీపీఠంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. శతకోటి లలితా కుంకుమార్చనల్లో భాగంగా తొమ్మిది రోజులకు 31 కోట్ల మేర కుంకుమార్చనలు పూర్తయ్యాయన్నారు. డిసెంబరు 6, 7 తేదీలకు వంద కోట్లు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. నెల రోజులు పాటు అంటే డిసెంబర్ 13 వరకూ జరగనున్న మహాశక్తి యాగంలో కుంకుమార్చనలు 116 కోట్లు జరుగుతాయన్నారు. నెల రోజుల పాటు దీక్ష తీసుకున్నట్టు శ్రీపీఠం వస్త్రం ధరించి కుంకుమ పూజల్లో పాల్గొనే మహిళలు 12 వేల మందికి ఐడీ కార్డులు ఇచ్చామన్నారు. వారితో పాటు రోజూ 4 వేల మంది వరకూ అదనంగా వస్తున్నారన్నారు. వారందరికీ కుంకుమ పూజలకు అవకాశం కల్పించడంతో పాటు ఉదయం, సాయంత్రం ఫలహారం, మధ్యాహ్నం అన్న ప్రసాదం కలిసి మొత్తం 24 వేల మందికి చేయిస్తున్నామన్నారు. ఈ నెల 26న కార్తిక పౌర్ణమి సందర్భంగా భక్తుల మధ్య ఐశ్వర్య దీపం వెలిగిస్తామన్నారు. ఆ రోజు నుంచి బగళాముఖి అమ్మవారి చక్రం మైదానంలోకి తీసుకువచ్చి సుమారు 5 వేల మంది చూసేలా ప్రతి రోజూ హోమం ఉంటుందన్నారు.

బంగారం దొంగిలించిన మహిళ అరెస్టు

రావులపాలెం: మహిళకు మత్తుమందు ఇచ్చి, మెడలోని బంగారు ఆభరణాలను కాజేసిన మహిళను అరెస్టు చేసి, ఆమె నుంచి 20 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు రావులపాలెం ఎస్సై ఎం.వెంకట రమణ బుధవారం తెలిపారు. తణుకు పట్టణానికి చెందిన కడలి పద్మిని ఈనెల 18న వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయానికి మొక్కు తీర్చుకోవడానికి వచ్చింది. ఆమెతో అదే పట్టణానికి చెందిన సైలాడ దుర్గా భవాని పరిచయం పెంచుకుంది. వాడపల్లిలో స్వామివారి దర్శనం చేయించింది. అనంతరం కూల్ డ్రింక్‌తో మత్తుమందు కలిపి పద్మినితో తాగించింది. ఆమె మత్తులో ఉండగా రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ తీసుకువచ్చింది. మెడలోని బంగారు పుస్తెలతాడును తీసుకుని పరారైంది. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితురాలు దుర్గాభవానిని స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అరెస్టు చేశారు. రిమాండ్ కోసం కొత్తపేట జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించారు.

ఆవుల అక్రమ తరలింపు

తొండంగి: బెండపూడి జాతీయ రహదారిపై బుధవారం రాత్రి గోవులను అక్రమంగా తరలిస్తున్న మూడు వాహనాలను పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి. వెంకటేశ్వరరావు తెలిపారు. విజయనగరం నుంచి రాజమహేంద్రవరానికి 30 గోవులను మూడు వాహనాలపై తరలిస్తుండగా బెండపూడి జాతీయ రహదారిపై నిఘా ఉంచి పట్టుకున్నామన్నారు. విజయనగరానికి చెందిన గవర ప్రసాద్, ఎస్.నరసింహారావు, జి.గోపాల్‌ను అరెస్టు చేశామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

* సందర్భం

గతంలో ఎం.ఎల్.ఏ అయిన ఒక పెద్ద హీరో స్త్రీల గురించి అసభ్యంగా మాట్లాడి అసెంబ్లీలో సంజాయిషీ ఇచ్చాడు. డెబ్బయి ఏళ్లు దాటిన ఒక సీనియర్ నటుడు నోరు పారేసుకుని పరువు పోగొట్టుకున్నాడు. పార్లమెంట్ సభ్యుడుగా ఉన్న మరో నటుడు స్త్రీల దుస్తుల గురించి సుద్దులు చెప్పి నిరసన ఎదుర్కొన్నాడు. ఇప్పుడు తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్. సెలబ్రిటీలుగా ఉన్నవారు ఎంతో బాధ్యతగా ఉండి యువతకు మార్గం చూపేలా ఉండాలి. వారు ఇలా తగలడితే స్త్రీలతో ఎలా వ్యవహరించాలో ఇంటినే బడిగా మార్చి తల్లిదండ్రులు నేర్పించాల్సి ఉంటుంది. అయితే ఇంటి ఆడవారికి తండ్రి, భర్త గౌరవం ఇచ్చి మాట్లాడుతున్నారా అనేది ప్రశ్న.

మగవారూ... భాష జాగ్రత్త


త్రిష


మన్సూర్ అలీఖాన్

అతడో ప్రసిద్ధ నటుడు. 'మా బ్లడ్డు వేరు మా బ్రీడు వేరు' అంటుంటాడు. కాని ఒక సభలో అభిమానులను చూసి పూనకం వచ్చి స్త్రీల గురించి అశ్లీలమైన వ్యాఖ్యలు చేశాడు. వందల సినిమాల్లో తండ్రిగానో బాబాయిగానో వేసిన ఒక నటుడు 'స్త్రీల మీద మీ అభిప్రాయం ఏమిటి?' అని సభలో యాంకర్ అడిగితే పరమ రోతగా సమాధానం ఇచ్చాడు. ఇక నటుడుగా, రియల్టర్‌గా గుర్తింపు పొందిన మరో పెద్ద మనిషి పార్లమెంట్ మెంబర్ అయ్యాక పార్లమెంట్‌లో నిలబడి మరీ 'స్త్రీల దుస్తుల వల్లే వారికి సమస్యలు వస్తున్నాయి' అన్నాడు.

స్త్రీలను ఏదో ఒకటి అనేయొచ్చు. అంటే వాళ్లు పడతారు. అనడానికే మేము పుట్టాము అనే చులకనభావం పురుష సమాజంలో నరనరాన జీర్ణించుకుని పోబట్టే ఈ ప్రతిఫలాలు. అదృష్టవశాత్తు ఇలాంటి వ్యాఖ్యలకు వెంటనే నిరసన పెల్లుబుకుతున్నా పురుషుల నోటి దురుసు తగ్గడం లేదు. తాజాగా తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్ ఇటీవల త్రిషతో 'లియో' సినిమాలో నటించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ 'ఆమె హీరోయిన్ అని తెలిశాక (గత సినిమాల్లో తాను చేసిన) బెడ్‌రూమ్ సీన్ ఉంటుందని ఆశపడ్డాను' అని వ్యాఖ్యానించాడు. 'ఇది సినిమా లాంగ్వేజ్' అని మన్సూర్ అనుకుని ఉండొచ్చుగాని దానిలోని అశ్లీల ధ్వనికి త్రిష రియాక్ట్ అయ్యింది. 'ఇతనితో ఇంకెప్పుడూ సినిమాల్లో నటించను' అని చెప్పింది. ఆ తర్వాత చినికి చినికి గాలివానై ఇప్పుడు మన్సూర్ మీద కేసు బుక్ అయ్యేంతగా వెళ్లింది. మగవాళ్లు 'సరదాగా మాట్లాడుతున్నామని' అనుకుంటూ కూడా స్త్రీలను కించపరిచే వ్యాఖ్యలు చేస్తారు. సరదాగా కించపరచడం ఏమిటో... కించపరచడం ఎలాంటి సరదానో వీరే చెప్పాలి.

ప్రసిద్ధులే దారి తప్పితే

రాజకీయ నేతలు, సినిమా నటులు, క్రీడాకారులు, వ్యాపారవేత్తలు... ఇలా సమాజంలో గుర్తింపు పొందినవారు స్త్రీల పట్ల మరింత గౌరవంతో మెలగుతూ ఆదర్శంగా నిలవాలి. కాని చాలాసార్లు రాజకీయ నాయకుల దగ్గరి నుంచి అన్ని రకాల ప్రముఖులు ఏదో ఒక సందర్భంలో చులకన మాటలు మాట్లాడుతూ కుసంస్కారాన్ని ప్రదర్శిస్తున్నారు. ఉత్తరాదిలో మంత్రులు 'మేం వేసిన రోడ్లు ఫలానా హీరోయిన్ బుగ్గల్లా ఉంటాయి' అంటూ వదరుతుంటారు. సల్మాన్ ఖాన్ 'సుల్తాన్' సినిమాలో కుస్తీ వీరుడిగా నటించి 'ఈ సినిమాలో కుస్తీలు చేస్తే రేప్ జరిగినంత పనయ్యింది నాకు' అని వ్యాఖ్యానించి మొట్టికాయలు తిన్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ఒక మాజీ మంత్రి ప్రస్తుత మంత్రిగా ఉన్న నటిపై దారుణమైన వ్యాఖ్యలు చేసి కోర్టు కేసును ఎదుర్కొనబోతున్నాడు.

బాల్యం నుంచి భావజాల ప్రభావం

'కుటుంబంలో తండ్రి (మగాడు) ముఖ్యం' అనే భావన బాల్యం నుంచి పిల్లల్లో ఎక్కించడం ద్వారా పురుష సమాజం తన ఆధిక్యతను స్త్రీలపై ఆధిపత్యాన్ని కొనసాగించేలా చేస్తుంది. తండ్రిని 'మీరు' అని, తల్లిని 'నువ్వు' అని అనడంలో ప్రేమ, గౌరవం, దగ్గరితనం ఉన్నా 'నువ్వు' అనడం వల్ల 'లెక్క చేయవలసిన పని లేదు' అనే భావన కలిగితే కష్టం. తిట్లు, బూతులు అన్నీ స్త్రీలను అవమానించేవే. వాటిని విని, పలికి స్త్రీల పట్ల అలా మాట్లాడవచ్చు అనుకుంటారు మగవారు. ఇంట్లో చెల్లెని, అక్కని, తల్లిని తండ్రి అదుపు చేసే తీరు చూసి, తామూ బయట స్త్రీలను అలాగే అదుపు చేయవచ్చనుకుంటారు. ఫైటర్ జెట్స్‌ను స్త్రీలు నడుపుతున్న ఈ కాలంలో కూడా 'మేమేమీ గాజులు తొడుక్కోలేదు', 'మూతి మీద మీసముంటే రా'లాంటి పౌరుష వచనాలను పురుషులు ఇంకా పలికేటంత వెనుకబాటుతనంలో ఉండటం విషాదకరం. శారీరక పరిమితులు ఉన్నంత మాత్రాన స్త్రీలు బలహీనులు, పురుషులు బలవంతులు కాబోరు.

తల్లిదండ్రులూ జాగ్రత్త

అబ్బాయిలను ఆడపిల్లలను గౌరవించేలా పెంచడం, టీనేజ్‌లో ఉన్న అబ్బాయిలకు సరైన కౌన్సెలింగ్ ఇవ్వడం ఇప్పటి తల్లిదండ్రుల తక్షణ కర్తవ్యం. చట్టాలు పకడ్బందీగా ఉన్న ప్రస్తుత రోజుల్లో తెలిసో తెలియకో అహంకారంతోనో పరుష వ్యాఖ్య, అసభ్య చేష్ట నేరుగా కాని సోషల్ మీడియాలోగాని చేస్తే వారు ప్రమాదంలో పడతారని హెచ్చరించాలి. చైతన్యం పెరిగింది. అబ్బాయిలూ భాష జాగ్రత్త.

న్యూస్ మేకర్

ఫైనల్ మ్యాచ్‌లో మన జట్టు ఓటమి చెందిన బాధలో ఆమె పెద్దగా ఎవరికంటా పడలేదుగానీ... ఆ తరువాత మాత్రం 'ఎవరీ అమ్మాయి?' అనుకున్నారు చాలామంది. గెలుపు తరువాత ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు పక్కన ప్రముఖంగా కనిపించిన ఆ అమ్మాయి పేరు... ఊర్మిళా రోసారియో. ఎవరీ ఊర్మిళ?

అవును... మన అమ్మాయే!



ఊర్మిళా రోసారియో ఆస్ట్రేలియన్ క్రికెట్ టీమ్ మేనేజర్. ఆమె తల్లిదండ్రులు ఐవీ, వాలెంటైన్ రోసారియోలది కర్ణాటకలోని మంగళూరుకు సమీపంలోని కిన్నిగోలి ప్రాంతం. ఐవీ, వాలంటైన్‌లు ఖతార్‌లోని దోహాలో ఉద్యోగం చేస్తున్న కాలంలో ఊర్మిళ జన్మించింది.

ఊర్మిళకు చిన్నప్పటి నుంచి ఆటలు అంటే చాలా ఇష్టం. స్కూలు రోజుల్లో క్రికెట్ కంటే బాస్కెట్‌బాల్, టెన్నిస్ బాగా ఆడేది. బంగీ జంపింగ్ అంటే ఇష్టం. ఖతార్ టెన్నిస్ ఫెడరేషన్‌లో మూడు సంవత్సరాలు పనిచేసింది.

కార్నెగీ మెలన్ యూనివర్శిటీలో బీబీఏ చేసిన ఊర్మిళ ఆ తరువాత ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టుకు మేనేజర్‌గా పనిచేసింది. ఒక నాన్-ఆస్ట్రేలియన్‌కు టీమ్ మేనేజర్ బాధ్యతలు అప్పగించడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఫుట్‌బాల్ ప్రపంచకప్ నేపథ్యంలో క్రికెట్ నుంచి కొన్ని నెలల పాటు విరామం తీసుకొని ఖతార్‌లో ఫుట్‌బాల్ స్టేడియం నిర్వాహణ బాధ్యతలు చూసుకుంది.

ఆ తరువాత మళ్లీ ఆస్ట్రేలియాకు వచ్చింది.

ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టు మేనేజర్‌గా ఊర్మిళ పనితీరు, హిందీ, కన్నడ, కొంకణి... మొదలైన భారతీయ భాషలలో నైపుణ్యం వరల్డ్‌కప్ టూర్‌లో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు మేనేజర్‌గా ఎంపిక చేయడానికి కారణం అయింది.

ఏడు సంవత్సరాల క్రితం ఊర్మిళ తల్లిదండ్రులు దోహా నుంచి మన దేశానికి వచ్చారు. కాఫీ ఎస్టేట్ కొనుగోలు చేసి కర్ణాటకలోని సకలేష్‌పూర్‌లో స్థిరపడ్డారు.

'క్రికెట్‌తో ఒకప్పుడు నాకు పెద్దగా పరిచయం లేదు. అలాంటి నాకు క్రికెట్‌తో ఇంత అనుబంధం ఏర్పడడం ఆశ్చర్యంగా ఉంది' అని నవ్వుతూ అంటుంది ఊర్మిల.

నవ్వడం సరే, క్రికెట్ టీమ్ మేనేజర్ అంటే మాటలా?

ఒక్కమాటలో చెప్పాలంటే...

'రెస్పాన్సిబుల్ ఫర్ ఎవ్రీథింగ్'

దీనిలో వందకు వంద మార్కులు కొట్టేసింది ఊర్మిళ.

ఊర్మిళ గత మార్చిలో తల్లిదండ్రులను చూడడానికి మనదేశానికి వచ్చింది. ఊర్మిళ ఇక్కడ ఉంటే కాఫీ ఎస్టేట్‌లో చిన్న చిన్న పనులు కూడా చేస్తుంది. ఆమె పక్కన ఉంటే తల్లిదండ్రులకు పండగే. కూతురి ఉన్నతి గురించి పెద్దగా మాట్లాడకపోయినా 'ఫైనల్ మ్యాచ్ చూడడానికి అహ్మదాబాద్‌కు వెళ్లాలనుకున్నాం. దురదృష్టవశాత్తు మా ఎస్టేట్ దాటి వెళ్లలేకపోయాం' అంటున్నారు ఊర్మిళ తల్లిదండ్రులు.

ఫైనల్ మ్యాచ్ మిస్ అయితే ఏమిటి?

ఏదో ఒకరోజు కాఫీ ఎస్టేట్‌కు ఊర్మిళ వస్తుంది కదా!

ఆ మ్యాచ్‌ను కళ్లకు కడుతుంది కదా! ఇక దిగులెందుకు!!


తల్లిదండ్రులతో ఊర్మిళ


వన్స్ అపాన్ ఏ టైమ్... కుటుంబ సభ్యులతో... (కింది వరసలో మధ్యలో)

ఈ వెడ్డూరం చూశారా!

వెడ్డింగ్ విత్ టికెట్!

కొంతమంది ఎంతోఘనంగా జరుపుకునే తమ పెళ్లి వేడుకల వీడియోలను అమ్ముకుంటూ డబ్బులు సంపాదించడం ఇప్పటి ట్రెండ్‌గా మారింది. ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు తమ పెళ్లి వీడియోలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరిలానే సెలబ్రిటీ హోదాలేని వారు సైతం విదేశీయులకు పెళ్లి టికెట్లు అమ్మి వెడ్డింగ్ పర్యాటకానికి తలుపులు తెరుస్తున్నారు.

భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. అందుకే చాలా మంది విదేశీయులు ఇక్కడి సంస్కృతిని తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. విదేశాలతో పోలిస్తే ఇండియాలో ఎంతో శాస్త్రోక్తంగా పెళ్లిళ్లు జరుగుతాయి. ఈ పెళ్లిళ్లను చూసేందుకు విదేశీయులు చాలా ఉత్సాహం చూపుతారు. పెళ్లి సంప్రదాయాలు, రకరకాల రుచికరమైన వంటకాలను టేస్ట్ చేసేందుకు తహ తహలాడుతుంటారు. అందుకే ఏ మాత్రం అవకాశం చిక్కినా వెంటనే వచ్చి ఇండియాలో వాలిపోతుంటారు. ఇందుకు ఎంత డబ్బు ఖర్చు పెట్టడానికైనా వెనుకాడరు. ఈ అభిరుచినే మన భారతీయ జంటలు, వెడ్డింగ్ ప్లానర్స్ సొమ్ము చేసుకుంటున్నారు. దీనికోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్లూ నడుపుతున్నారు. వెడ్డింగ్ ఇన్విటేషన్‌ను టికెట్‌గా చూపిస్తూ నిశ్చితార్థం నుంచి, మెహందీ, సంగీత్, హల్దీ ఇలా ఒక్కో వేడుకకి ఒక్కో రేటుని చెబుతూ పర్యాటకులను ఆకర్షిస్తున్నారని వెడ్డింగ్ ప్లానర్స్ చెబుతున్నారు.

జాయిన్ మై వెడ్డింగ్...

పెళ్లి చేసుకునే జంట సొంతంగా జాయిన్ మై వెడ్డింగ్ పేరుతో అకౌంట్‌ను క్రియేట్ చేస్తారు. ఈ వెబ్‌సైట్‌లో పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఇద్దరి ఫోటోలు, పెళ్లి తేదీ, ఎన్నిరోజులు వేడుకలు జరుగుతాయి.. ఏ రోజు ఏ కార్యక్రమాలు నిర్వహిస్తారు... వంటి వివరాలను అప్‌లోడ్ చేస్తారు. పెళ్లిలో పెట్టే భోజనం వెజ్, నాన్‌వెజ్, మందు, చిందు ఉంటే అదీ చెబుతారు. ఇవేగాక డ్రెస్ కోడ్, అక్కడ మాట్లాడే భాష, వేడుక జరిగే ప్రదేశం అడ్రెస్‌తోపాటు ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్‌ను ఇస్తారు. విదేశీ పర్యటనలో ఉన్న వారికి ఈ పెళ్లి తేదీలు జత కుదిరితే టికెట్స్ బుక్ చేసుకుని వచ్చేసి మరీ పెళ్లి బ్యాండ్ బాజా, బారాత్‌లను ఎంజాయ్ చేస్తున్నారు.



ఒక్కరోజుకి పన్నెండు వేలపైనే...

ఎంతో ఆడంబరంగా జరిగే మన వివాహ వేడుకలను చూడడానికి పర్యాటకులు రోజు కోసం 150 డాలర్ల టికెట్‌ను సంతోషంగా కొనేస్తున్నారు. మన రూపాయలలో పన్నెండు వేలకు పైనే. ఇక పెళ్లి పూర్తి తతంగం మొత్తం అంటే రెండు రోజులు చూడాలంటే 250 డాలర్లు చెల్లించాలి (రూ.20 వేలకుపైన). ఒకటీ, రెండూ కాదు ఐదు రోజుల పెళ్లి చూడాలంటే ప్రత్యేక వెడ్డింగ్ ప్యాకేజీ టికెట్ కొనాల్సిందే. ఇలా పదిమంది విదేశీ అతిథులు పెళ్లికి వచ్చారంటే పెళ్లిలో కొన్ని ఖర్చులకు సరిపడా డబ్బు సమకూడినట్లే! అందుకే ఎక్కువ మంది వెడ్డింగ్ టూరిజంపైన ఆసక్తి కనబరుస్తున్నారు.

తొలిసారి...

హంగేరియన్- ఆస్ట్రేలియన్ సంతతికి చెందిన ఒర్సి పర్కాణి తొలిసారి 2016లో 'జాయిన్ మై వెడ్డింగ్' పేరిట వెబ్‌సైట్‌ను క్రియేట్ చేసింది. అప్పుడు ఇది ఒక చిన్న స్టార్టప్. కానీ ఇప్పుడు ఇది ట్రెండ్‌గా మారింది. ఈ ఏడాది ఆగస్టు 19న పర్యాటక మంత్రిత్వ శాఖ వెడ్డింగ్ టూరిజంను ప్రారంభించింది. వెడ్డింగ్ టూరిజం ద్వారా భారతీయులేగాక, విదేశీయులు సైతం ఇక్కడికి వచ్చి ఇక్కడి సంప్రదాయాలకు తగ్గట్టుగా పెళ్లి వేడుకలు జరుపుకోవచ్చని చెబుతూ వెడ్డింగ్ టూరిజాన్ని ప్రోత్సహిస్తోంది. బీచ్ వెడ్డింగ్, నేచర్ వెడ్డింగ్, రాయల్ వెడ్డింగ్, హిమాలయన్ వెడ్డింగ్ థీమ్‌ల పేరిట ప్రచారం నిర్వహిస్తోంది. ఈ ట్రెండ్‌కు మంత్రిత్వ శాఖ ప్రోత్సాహం బూస్టర్‌గా పనిచేసి ఇండియాలో వెడ్డింగ్ వ్యాపారం వృద్ధిలోకి రాబోతుంది. ఇంకెందుకాలస్యం... మీ ఇంట్లో జరిగే పెళ్లివేడుకలకు వెడ్డింగ్ టూరిజంను జోడించి మరింత కలర్‌ఫుల్‌గా జరుపుకోండి.

సెర్మనీ గైడ్...

విదేశీయులను పెళ్లికి పిలవడమేగాక, వారికి అతిథి మర్యాదల్లో లోటు లేకుండా చూసుకోవడం ఈ వెడ్డింగ్ టూరిజం ప్రత్యేకత. వేడుక లో జరిగే ప్రతి విషయం, పర్యాటకులకు వచ్చే సందేహాలు నివృత్తి చేసేందుకు సెర్మనీ గైడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు." ప్రస్తుతం రాజస్థాన్, ఢిల్లీ, ముంబైలలో ఈ వెడ్డింగ్ టూరిజం పెరుగుతోంది. రాజస్థాన్‌లోని చిన్నటౌన్లలో జరిగే వేడుకలకు విదేశీయులు ఆసక్తి చూపుతున్నారు. జోధ్‌పూర్, జైపూర్, జైసల్మేర్, ఉదయ్‌పూర్‌లలో జరిగే రాయల్ ఇండియన్ వెడ్డింగ్స్‌కు డిమాండ్ ఇంకా ఎక్కువగా ఉంది" అని వెడ్డింగ్ ప్లానర్స్ చెబుతున్నారు.

బ్యూటిప్స్

ముడతలు మచ్చలు పోవాల్సిందే...



కళ్లకింద ఏర్పడిన నల్లటి వలయాలు, ముడతలు, మచ్చలు అందమైన ముఖారవిందాన్ని పాడుచేస్తాయి. ఈ చిట్కాలు పాటిస్తే మీ సమస్యకు పరిష్కారం దొరికినట్లే...



- రాత్రి పడుకునేముందు కొద్దిగా అలోవెరా జెల్‌ను తీసుకుని కళ్ల కింద రాసి మర్దన చేసి పడుకోవాలి. ఉదయాన్నే నీటితో కడిగేయాలి.
- విటమిన్ ఇ ఆయిల్ కొల్లాజెన్ బూస్టర్‌గా పనిచేసి కళ్లకింద రక్తప్రసరణ చక్కగా జరిగేందుకు తోడ్పడుతుంది. రాత్రి పడుకునే ముందు విటమిన్ ఇ ఆయిల్‌ను కళ్లకింద రాసి మర్దన చేయాలి.
- పై రెండూ అందుబాటులో లేని వారు కనీసం కొబ్బరి నూనెను అయినా కళ్లకింద రాసుకుని మర్దన చేసుకోవాలి. ఉదయాన్నే కడిగేయాలి.





ఈ మూడింటిలో ఏ ఒక్క చిట్కానైనా క్రమం తప్పకుండా పాటిస్తే కొద్దిరోజుల్లోనే ముడతలు, మచ్చలు పోయి ముఖారవిందం బాగుంటుంది.

గెలుపు దారి

వ్యాపారానికి సంబంధించిన ఐడియాలు ఏకాంతంగా కూర్చొని ఆలోచిస్తేనే వస్తాయి... అనే గ్యారెంటీ లేదు. వ్యాపార విజయాలు ఫలానా వయసుకు మాత్రమే పరిమితం... అనే నియమాలేవీ లేవు. నగలు అంటే బంగారమే... అనే శాసనం ఏదీ లేదు. ఇందుకు ఉదాహరణ ముంబైకి చెందిన హేమా సర్దా...

వెదురు నగల వెలుగుల్లో...

కొన్ని సంవత్సరాల క్రితం... దిల్లీలో జరిగిన హస్తకళల ప్రదర్శనకు హాజరైంది హేమా సర్దా. వినూత్నంగా కనిపించిన అస్సామీ బ్యాంబూ జ్యువెలరీని కొనుగోలు చేసింది. ఈ వెదురు నగలు తనకు ఎంతగా నచ్చాయంటే 65 సంవత్సరాల వయసులో 'బ్యాంబు అండ్ బంచ్' రూపంలో డైరెక్ట్-టు-కన్జ్యూమర్(డీ2సీ) బ్రాండ్‌కు శ్రీకారం చుట్టేంతగా. అస్సాంలోని గిరిజనులు తయారు చేసిన అందమైన వెదురు నగలను తన బ్రాండ్ ద్వారా విక్రయిస్తుంది హేమ. మన దేశంలో జువెలరీ అంటే బంగారం, వెండి... అనే అభిప్రాయాన్ని తన బ్రాండ్ ద్వారా మార్చే ప్రయత్నం చేస్తోంది. బయటి ప్రపంచానికి అంతగా తెలియని వెదురు నగలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

రకరకాల ప్రాంతాలలో తమ ప్రాడక్ట్స్‌కు సంబంధించి ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసింది. మౌఖిక ప్రచారం ద్వారా వెదురు నగల అమ్మకాలు ఊపందుకున్నాయి.

పదిహేను వేలతో వ్యాపారం ప్రారంభించి తన బ్రాండ్‌ను లాభాల బాట పట్టించింది హేమ. వ్యాపార వృద్ధికి సోషల్ మీడియాను ప్రధాన వేదికగా మలుచుకుంది. తమ బ్రాండ్‌కు చెందిన వెదురు నగల చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసేది. దీంతో ఎక్కడెక్కడి నుంచో ఆర్డర్లు రావడం మొదలైంది.

సంప్రదాయ వెదురు ఆభరణాలకు మోడ్రన్ ట్విస్ట్ ఇచ్చి కొనుగోలుదారులను ఆకట్టుకునేలా చేయడంలో హేమ విజయం సాధించింది. నాణ్యమైన వెదురును కొనుగోలు చేసి అస్సాంలోని ట్రైబల్ ఆర్టిస్ట్‌ల దగ్గరికి పంపుతుంది.

'అరవై అయిదు సంవత్సరాల వయసులో మార్కెట్ తీరుతెన్నులను గురించి తెలుసుకోవడం కష్టమే కావచ్చు. ఈ వయసులో అవసరమా అని కూడా అనిపించవచ్చు. అయితే నేను ఎప్పుడూ అలా అనుకోలేదు. కొన్నిసార్లు ప్రయాణమే పాఠాలు నేర్పుతుంది. నా విషయంలోనూ ఇదే జరిగింది. మొదట్లో మా బ్రాండ్ పెద్దగా సక్సెస్ కాలేదు. జరిగిన తప్పులను సవరించుకొని ముందుకు వెళ్లాను' అంటుంది హేమ.

కోడలు తాన్య సహాయంతో మార్కెట్ ప్లేస్‌లను లొకేట్ చేయడం నుంచి సోషల్ మీడియా మార్కెటింగ్, ఫొటోగ్రఫీ వరకు ఎన్నో విషయాలు నేర్చుకుంది హేమ.

'నాణ్యమైన నగల అలంకరణకు బంగారమే అక్కర్లేదు అని చెప్పడానికి బ్యాంబూ జువెలరీ ఉదాహరణ. డబ్బు సంపాదన కోసం ఈ వ్యాపారం ప్రారంభించలేదు. వినూత్నమైన కళను ప్రజలకు చేరువ చేయాలనేది నా ప్రయత్నం' అంటుంది హేమా సర్దా.


హేమా సర్దా

